# తప్పు

మొత్తంవెయ్యి రూపాయలకీ తగ్గించేదేమీ లేదన్నారు శ్రీకంఠరావుగారు. తనకి ఎనిమిది వందలు, తన జూనియర్‌కి రెండు వందలు. "ఇష్టమైతే చేయించుకోమను, లేకపోతే పొమ్మను. అణాకీ బేడకీ చేసే ప్లీడర్లు చాలామందున్నారు. ఎవడి దగ్గరకో ఒకడి దగ్గరికి పొమ్మని చెప్పు" అన్నారు శ్రీకంఠరావుగారు.

"చిత్తం. అలాగే చెప్తాను" అని హాల్లోంచి నడవలోకి వెళ్లేడు రావుగారి ముసలి గుమాస్తా.

రాత్రి పది గంటలయింది.

హాల్లో నూరు కాండిల్స్ దీపం బంగారం మండినట్టు మండుతోంది. దీపం కింద బల్లకి చేరువుగా మెత్తని కుర్చీలో కూర్చున్న రావుగారు, చేతిలోని కాయితాల కట్టని నిస్సారంగా బల్లమీదికి విసిరి పక్కకి చూసేరు.

పక్కని కుర్చీలో ఓ పదహారేళ్ల ఆడపిల్ల కూర్చొని ఉంది. సింధీ వాళ్ల షాపులో చీరల అడ్వర్టయిజుమెంటు కోసం పెట్టిన బొమ్మలా ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. ఆమె చాయ బంగారపు మెరుగులాగా, ఆమె కట్టుకున్న చీర సముద్రపు నురగలాగా ఉన్నాయి. ఆమె ముఖం వెన్నెల్లా చల్లగా ఉంది. ఆమె కళ్లు రావుగారి ముఖం వెనుక ఏమి దాగుందో చూడాలనే పరీక్షలో ఉన్నాయి.

"ఏం చిన్నారీ, పడుకోకుండా ఇక్కడ కూర్చున్నావేం? ఎంత రాత్రయిందో తెలుసా?" అని ఆ అమ్మాయిని అడిగేరు రావుగారు.

"ఇప్పుడు రాత్రి పదిగంటలయిందని నీకు తెలుసా నాన్నా? నువ్వింకా భోజనం చెయ్యలేదని కూడా నీకు తెలుసా?" అని ఎదురు ప్రశ్నలు వేసింది చిన్నారి.

ఆమె పేరు శ్రీలక్ష్మి. కాని, తండ్రికి మాత్రం "ఆమె ఇంకా చిన్నారే!"

రావుగారు తన కూతురి మాటలకి చిరునవ్వు నవ్వేరు.

"డబ్బు కావాలంటే పనిచెయ్యాలమ్మా! నీకు పెళ్లి చెయ్యాలంటే డబ్బు కావాలమ్మా! డబ్బు కోసం మరి నేను కష్టపడాలి కదమ్మా?" అన్నారు రావుగారు.

రావుగారి కుమార్తె ముఖం రావుగారి మాటలకి ఎర్రబారింది. ఆమె ఏదో అనబోయింది. అంతలో ఆ గదిలోకి ఓ ఇరవయ్యేళ్ల యువకుడూ, ఓ నలభయ్యేళ్ల ఆడమనిషీ వచ్చి రావుగారికి నమస్కరించి నిల్చున్నారు.

ఆ యువకుడు అందంగా ఉన్నాడనే చెప్పాలి. ఆరోగ్యంగా ఉన్నాడనే చెప్పాలి.

పరిశుభ్రంగా లేడని మాత్రం చెప్పాలి. పంచె కట్టుకొని, పొట్టిచేతుల కబ్బా తొడుక్కొని తలపాగా చుట్టుకొని ఉన్నాడతను. నుదురు విశాలంగా ఉంది. ముక్కు ఎత్తుగా ఉంది. గడ్డం సూదిగా ఉంది. కళ్లు మెరగ్గా ఉన్నాయి. చెవుల్ని ఎర్రపాళ్ల దుద్దులున్నాయి. అతని రంగు కొత్తగా కొని ఇంకా శుభ్రంగా తోమని రాగి బిందె రంగులా ఉంది. అతని పక్కని ఉన్న ఆడమనిషి అతనికి వయసుపంచి, మీసం తీసి, పాగా లాగివేసి, ఆడవేషం వేసినట్టుగా ఉంది. అతనికి ఆవిడ అక్కలా ఉంది. అక్క కాదు తల్లని రావుగారికి తనే తెలియజేసేడు. ఆవిడ కట్టుకున్న చీరనిండా నలుపుంది. ఆమె కళ్లనిండా దైన్యం ఉంది. ఆవిడ ముడుచుకున్న కొప్పు ధూళి ధూళిగా ఉంది. ఆమె మెళ్లో ఒక తాడు మాత్రం ఉంది. ఆవిడ చెవులకి రంధ్రాలు మాత్రం ఉన్నాయి. ఆ చెవి తమ్ములు చచ్చిపోయినట్టు వేళ్లాడుతున్నాయి. కంఠంలో ప్రాణం ఉన్నప్పటికీ అంచుల్లో అప్పుడే మృత్యువు ప్రవేశించినట్టుగా చూపిస్తున్నాయి ఆ చెవి తమ్ములు. వాటిని చూసి రావుగారి కుమార్తె కొంచెం బెదిరింది. ఆమె వళ్లు జలదరించింది. ఆమె ఆ తల్లీ కొడుకులవైపు తదేక ధ్యానంగా చూస్తూ వాళ్లు చెప్పేది శ్రద్ధగా వినసాగింది.

వాళ్లు చాలా దీనావస్థలో ఉన్నారట. ప్రస్తుతం చాలా కష్టదశలో ఉన్నారట. అవతల వాళ్లు చంపడానికి వస్తే ఆ యువకుడి తండ్రి (ఆ ఆడమనిషి భర్త) వాళ్లందర్నీ ఆపి ఒక్కడూ నిలబడి దెబ్బలాడేట్ట. అవతల పార్టీలో ఇద్దరు చచ్చిపోకపోతే మిగతావాళ్లు పారిపోక పోదురట. ఇతణ్ణీ చంపేద్దురట. వాళ్లమీద కేసు పెట్టకుండా కనీసం ఆ యువకుడి తండ్రిని అప్పటికైనా పంపించకుండా, అతనికి తగిలిన దెబ్బలకి కట్టుకూడా కట్టకుండా అరెస్ట్ చేసి జెయిల్లో పెట్టించేరుట పోలీసువాళ్లు.

"ఏమో! ఏంచేశారో! మీవాడిమీద పెట్టిన కేసుమాత్రం ఖూనీకేసు! ఖూనీకేసంటే మామూలు న్యూసెన్స్ కేసుకాదు. పావలాకీ అర్ధకీ చెయ్యడానికి!"

అన్నారు రావుగారు.

అయన చెప్పిందీ రైటేనట. వెయ్యి రూపాయలూ అడగడం కూడా న్యాయమే అనుకోండి. కాని, వాళ్లు అంత ఇచ్చుకోలేరుట. తగువు భూమి ఎకరం కాక మరో రెండెకరాల మెట్ట మాత్రం వాళ్లకి ఉందిట. అది అప్పుడు అమ్మినా అంత సొమ్ము రాదట. వాళ్ల యందు దయుంచి, వాళ్లని చూసి కనికరించి రావుగారు ఓ నాలుగు వందలు తీసుకొని......

వీల్లేదన్నారు రావుగారు. వాళ్లాక అరగంట బతిమాలుకున్నారు. ఆ తరువాత వెళ్లిపోయేరు.

రావుగారి కూతురు రావుగారివైపు చూసింది.

"మళ్లీ వాళ్లే వస్తారు" అని ధీమాగా అన్నారు రావుగారు. తన కూతురి కళ్లలోని ఆందోళనని చూసి.

"అదికాదు నాన్నా".

"ఏఁవిఁటి కాదు తల్లీ?"

"వాళ్లు నిజంగా లేనివాళ్లేనా?"

"లేనివాళ్లలాగే కనిపిస్తున్నారు".

"డబ్బు లేనివాళ్లని అంత డబ్బు రొక్కించి అడగడం తప్పుకదా? నాన్నా?"

"తప్పేం ఏం? ఇస్తే ఇస్తారు. ఇవ్వకపోతే ఇంకోడి దగ్గరికి పోతారు".

"నువ్వు తెలివైన లాయరువి కదా అని వచ్చేరు కదా పాపం!" అంది శ్రీలక్ష్మి చాలా జాలిగా.

"నా తెలివితేటలు వాడుకోవాలంటే నా రేటు నాకు ఇవ్వాలమ్మా! నేను ఎవ్వర్నీ అన్యాయం చెయ్యలేదు. ఎవరి సొమ్మూ కూడా నేను పడేసుకోడం లేదు. వాళ్లకి పనికొచ్చే తెలివితేటలు నాకు మాత్రం ఇచ్చేడు భగవంతుడు. దానికి నేను ఖరీదు ఇంత అని కట్టి వుంచాను. అందులో తప్పేంవుంది చిన్నారీ. బజార్లో బనారసు చీర ఖరీదు ఆరు వందలు! కొనగలిగితే కొంటావు లేకపోతే, ఇంకోచోటుకి పోయి ఇంకో చీరె కొనుక్కుంటావు అలాగే ఇదీను!...."

అని నవ్వుతూ లేచి నిల్చొని,

"పద, భోజనానికి పద"

అన్నారు రావుగారు.

తండ్రి తెచ్చిన సొమ్ము సరైనది కాదేమో అని ఎందుచేతనో గాని అనిపించింది శ్రీలక్ష్మికి. కాని తండ్రికి ఆకలిగా ఉండి ఉంటుంది. వాదించడానికి వేళ కాదని ఊ రుకుని తండ్రి వెనక ఇంట్లోకి వెళ్లింది.

రాత్రి పదిన్నర దాటింది.

★ ★ ★

రాత్రి పదిన్నర దాటింది. డాక్టర్ మూర్తి గారు తన (స్వంత) డిస్పెన్సరీ నించి ఇంటికి వచ్చి, వేణ్ణీళ్ల స్నానం చేసి, తేలిక దుస్తులు తొడుక్కుని టేబిల్ దగ్గిర భోజనానికి కూర్చొనేసరికి ఎంత రాత్రయినా సరే ఆయన వచ్చేదాకా ఆయన భార్య భోజనం చెయ్యదు. ఆయనకి ఎదురుగా కూర్చొని ఆయనతోపాటే తింటుంది.

డైనింగ్ హాల్లో ట్యూబులైటు ధగధగలాడుతోంది. టేబిల్ మీద ఆకుపచ్చని ఆయిల్ క్లాత్ మీద పెట్టిన వెండి గిన్నెలూ, గాజు ప్లేట్లూ తళతళ మెరుస్తున్నాయి. గిన్నెలమీద మూతలు తీసేసరికి సుఖమైన భోజనం వాసన మధురంగా నిండుకొంది.

మూర్తిగారికి ముప్ఫయ్యేళ్లుండవచ్చు. ఆయనకి తలమీద వెంట్రుకలు తగ్గుతున్నాయి. కాని, వంటినిండా విటమిన్లూ, ప్రొటీన్లూ పెరుగుతున్నాయి. అతను ఎర్రగా నవ్వుతూ, బలంగా, ఈజీగా ఉన్నాడు.

డాక్టర్ గారి భార్యకి పాతికేళ్లుండవచ్చు. ఆవిడ పచ్చగా దబ్బపండులా ఉంది. బొద్దుగా ఉన్నప్పటికీ పొడవుగా ఉంది. పొడవుగా ఉండడమే కాకుండా అందంగా ఉంది. అందంగానే కాకుండా చాలా నాజూగ్గా వుంది. నాజూగ్గానే కాకుండా కళగా ఉంది.

మంచిగా కూడా ఉంది.

ఆమెకీ మూర్తిగారికీ వివాహం జరిగి తొమ్మిది లేక పది సంవత్సరాలయ్యుండవచ్చు.

అతడప్పుడు మెడిసిన్ చదువుతున్నాడు. త్వరలోనే పాసయేడు. పాసయేక మరి రెండేళ్లకే మాస్టర్ ఆఫ్ సర్జరీ డిగ్రీ ఫస్టుక్లాసుది సంపాదించేడు. సంపాదించేక ఉద్యోగం అనవసరం అనిపించిం దతనికి. అసిస్టెంట్ సర్జన్‌గా ఎన్నాళ్లో "రాట్" అవాలి. ఎందుకది? తనేం లేనివాడు కాదు కద. ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టుకొంటే, అదృష్టం బావుంటే....

మూర్తి డాక్టర్‌కి అదృష్టం బావుంది. ఆయన క్లినిక్ పెట్టుకున్న కొద్ది రోజుల్లోనే సర్జరీలో (శస్త్ర చికిత్సలో) అఖండుడని పేరు తెచ్చుకున్నాడు. అతని చేతులు చల్లని చేతులని, అతని కత్తికి కూడా వైద్యం వచ్చునని అతను చావును చంపగలడనీ, ప్రజలంతా ఏమేమో చెప్పుకుంటారు. అతను డబ్బు ఎంత కరెక్ట్‌గా తీసుకుంటాడో పనికూడా అంత ఖచ్చితంగా చేస్తాడని అందరికీ బాగా తెలుసు. పెద్దాసుపత్రిలో కూడా అంతటి డాక్టరు లేట్ట. మరింక జిల్లాకి అతనే రాజు.

అదృష్టం అంతా ఆయన భార్యదట. లక్ష్మీకళ అంతా ఆవిడలోనే ఉందిట. పదేళ్లయి పెళ్లయినా నిన్న పెళ్లయినట్టు ఉంటుందిట. ఇద్దరు పిల్లలు - చక్కగా ఒక్క కొడుకూ, ఒక్క కూతురూ - ఉన్నారని ఎవరూ అనుకోరుట. నిన్న పెద్దమనిషయిన కన్నెపిల్లలా ఉంటుందిట. కొడుకుని చక్కా సైనిక్ స్కూల్లో వేయించేరుట. కూతుర్ని ఆ పిల్ల తాత ఒగ్గట్ట, తీసుకువెళ్లి తన దగ్గరే పెట్టుకున్నాట్ట, "మనవరాలంటే ఆ బాబుకు అంత మోజు".

లక్ష్మీదేవి లాంటి భార్యవైపు ఓసారి చూసి తలదించి ఫోర్కూ, స్పూనూ సర్దుకుంటూ!

"సో! డార్లింగ్ ఏఁవిఁటి సంగతులు!"

అని అడిగేడు డాక్టర్ మూర్తి.

డాక్టర్ గారి భార్య ఏదో జవాబు చెప్పబోతోంది. అంతలోనే ఆ గదిలోకి ఆయాలా కనబడే "ఆడబంట్రోతు" ఒకామె వచ్చి,

"బాబూ ఎవరో పేషెంటొచ్చారు" అని సమాచారం చెప్పింది.

"ఎవరో పేషెంటుట! సంగతు లేఁవిఁటని అడిగేరు కదా! అవే సంగతులు! ఇంకేఁవి ఉంటాయి?!"

అంది డాక్టర్ భర్తతో భార్య. మూర్తి డాక్టర్‌కి కోపం వచ్చింది. భార్యని చూసి కాదు, ఆయాని చూసి.

"భోజనం చేస్తుంటే పేషెంట్ల సంగతి చెప్పొద్దని నీకెన్నిసార్లు చెప్పేను? పేషెంట్లొస్తే నేను భోంచేసేదాకా కూర్చోమని చెప్పలేవూ! ఇడియట్!" అని కసిరేడు మూర్తి డాక్టరు.

కసురు పుచ్చుకొని ఆయా బైటికి వెళ్లింది.

డాక్టర్ మూర్తి వెంటనే చిరునవ్వు నవ్వేడు సతీమణి వైపు తిరిగి.

అందుగురించే అతని సతిమణి ఆశ్చర్యపడుతూంటుంది. ఆ క్షణంలో అంత భయం కరంగా గర్జించి మరుక్షణంలో అతను అంత మనోహరంగా మందహాసం ఎలా చెయ్యగలడా అనే విషయం ఆమెకి ఈ తొమ్మిది పదేళ్లయి కూడా అర్థం కాకుండా ఉంది. *

"డాక్టర్ జెకిల్ ఎన్డ్ మిస్టర్ హైడ్‌లా మీరు ఎలా ఉండగలరండీ?" అని ఆవిడ ప్రశ్నించింది.

భార్య ప్రశ్నకి డాక్టర్ మూర్తి పకాల్ మని నవ్వేడు.

"క్రిందివాళ్లతోనూ మనవాళ్లతోనూ ఒక్కలా ఎలా ఉండగలం లక్ష్మీ? కింది మనుషుల్తో కర్కోటకంగా హెర్ హిట్లర్లా వుండకపోతే లాభం లేదే. తినేరూ మనల్ని?! మనవాళ్లతో ఒకలా వుండాలి. వాళ్లతో ఇంకోలా ఉండాలి. మన లెవిల్ వేరు వాళ్ల లెవిల్ వేరు. తక్కువ్వాడి దగ్గర మన ఎక్కువతనం చూపించకపోతే వాడు మనకంటే ఎక్కువ్వాణ్ననుకుంటాడు. అందుచేత మనం ఎవరి లెవిల్లో వాళ్లని ఉంచాలి. నా పాలసివే అది!"

అంటూ నవ్వుతూనే, నిజ జీవితంలో తను పాటించే నిత్యసూత్రం భార్యకి తెలియ జేసేడు మూర్తి డాక్టర్.

"మంచిగానూ, మర్యాదగానూ ఉండటానికి "లెవిల్స్" ఎందుకండీ? ఏఁవిఁటో, మీ వరస నాకర్థం కాదు" అని భార్య కూడా భర్తలాగే భోజనానికి ఉపక్రమించింది. భర్తగారు భోజనరంగంలో పూర్తిగా దిగిపోయే ఉన్నారు.

భూ ప్రపంచంలోని కొన్ని మంచి ఆహార పదార్థాలు తిరుబాటుగా ఖర్చు చేసేక, కుర్చీలోంచి లేచి వెళ్లి మూతినీ చేతినీ కడుక్కొని మూర్తిగారు తువ్వాలు తీసి తుడుచుకొంటూ వచ్చి, భార్య భోజనం ఇంకా పూర్తి కాలేదు కాబట్టి - ఆమెకి ఎదురుగా మళ్లీ కూర్చోబోయేరు. కాని, ఆమె వారించింది.

"పేషెంటెవరో, పాపం వచ్చేరుట వెళ్లి చూడండి". అంది భర్తతో ఆమె.

భర్త మూర్తి అయిష్టంగా అవతలికి వెళ్లేడు.

మరొక పది నిమిషాలకు డాక్టరు గారి భార్య కూడా భోజనం పూర్తిచేసి, ముందు హాల్లోకి వచ్చేసరికి రాత్రి పదకొండు దాటింది.

(వాళ్ల విలాస గృహాల్లో తప్ప) పెద్దింటివాళ్ల దీపాలన్నీ ధగధగలాడతాయి. మూర్తి డాక్టరు గారి ముందుగది దీపం ఆమాదిరిగానే ఉంది. ఆయన భార్య అక్కడికి వెళ్లేసరికి మూర్తిగారు ముఖం ముడుచుకొని చిరాగ్గా నిల్చున్నారు. ఆయన ఎదురుగా వీధి గుమ్మం వారని ఓ నడికాలపు మనిషి వినయంగా నిల్చున్నాడు.

వినయంగానే ఉన్నాడు కాని, అతన్లో తొందర కనిపిస్తోంది.

తలమీద పాగా కనిపిస్తోంది, మొకుకులదాకా ఎగ్గట్టిన పంచెమీద పొట్టిచేతుల కబ్బా కనిపిస్తోంది. చేతులనిండా మట్టిపొరలు కనిపిస్తున్నాయి. చేతుల్ని గుండెమీద కట్టుకొని, విప్పి, అర్థించినట్లుగా ముందుకు చాచి, మళ్లీ కట్టుకొని గాభరా గాభరాగా మాట్లాడ్డంతో తొందరా, భయమూ, ఆవేదనా కనిపిస్తున్నాయి. అతను బలంగానే కనిపిస్తున్నాడు కాని, అంత ఆరోగ్యంగా ఉన్నట్టు లేదు. ముక్కు ఎత్తుగా ఉంది. కళ్లు మెరఁగ్గానూ, ఎర్రగానూ ఉన్నాయి. చెవుల్ని ఎర్ర పొళ్ల దుద్దులున్నాయి. మాడిన రాగిబిందె రంగులో ఉన్నాడతను. అతనికి ముప్ఫయ్యేళ్లే వయసంటే ఎవరికైనా సరే నమ్మకం కలక్కపోవచ్చు. నలభయ్యేళ్లు దాటిన వాళ్లా ఉన్నాడతను. (నిప్పుకి గాలిలాగా కాలానికి కష్టాలు సాయం చేస్తాయట.)

మనిషిని ఆరోగ్యంగా వున్నప్పుడు ఓసారి చూచి మళ్లీ జబ్బుగా ఉన్నప్పుడు చూస్తే పోల్చలేక 'ఇతన్నెక్కడో చూసినట్లుందే?' అనుకున్నట్లుగా అతణ్ని చూసి ఆ విధంగా అనుకొంది డాక్టర్ గారి భార్య.

"బాబుగారూ! నాకో ఎకరా మడిచెక్క మిగిలింది. అది అమ్మేసైనా సరే మీ ఋణం తీర్చుకుంటాను. ఎంతైనా యిస్తాను. మా అమ్మని తమరెలాగైనా రక్షించాలి. తమరు తప్ప మరెవరూ బతికించలేరట. ఆపరేషను వేగిరం చేస్తేనే కాని మనిషి బతకదట ఆ చీటీ మా ఊరి డాక్టర్ గారు తమరికి ఇమ్మని ఇచ్చేరు".

అని చెప్తున్నాడతను.

ఆ చీటీ అప్పుడే చదువుకున్నారు మూర్తి డాక్టరు గారు. ఆ చీటీ మళ్లీ ఆ ఆసామికి ఇచ్చేసేరు.

ఆ ఆసామీ చీటీ తీసుకొని, డాక్టరుగారు వైపు ఎర్రకళ్లతో బరువుగా ప్రశ్నార్థకంగా చూసేడు. చావా? బతుకా?! అనేది ఆ ప్రశ్న.

మూర్తి గారు చిరాగ్గా ముఖం పెట్టటంలోనే అవతల ఆసామికి వారి జవాబు తెలిసిపోతుంది. కాని ఆశ అంతరిస్తూ అంతరిస్తూ కూడా ఆశగా అడుగుతుంది.

"ఏం బాబూ? ఏం సెలవు?" అని అడిగేడతను.

మూర్తి డాక్టరు ఆ ఆసామి వైపు వీపు తిప్పి భార్య వైపు నడుస్తూ.

"మీ అమ్మా? ఎవరావిడ? ఆవిడొచ్చిందా?" అని అడిగేరు.

"బండిలో వేసి తీసుకొచ్చేను బాబూ! బండిలో ఉంది", అని జవాబు చెప్పేడతను.

"అయితే నే చెప్పినట్లే చెయ్యి! ఆవిణ్ని ఆస్పత్రికి తీసుకు వెళ్లు".

"ఆస్పత్రిలో తమరంత మంచిచెయ్యి లేదట బాబూ" అన్నాడతను.

"లేకపోతే ఏం చేస్తాం" అని భార్యదాకా వెళ్లి అక్కడ నిల్చొని ఆ ఆసామీ వైపు తిరిగేరు డాక్టరు గారు. ఆ తరువాత తన ఉద్దేశం ఏమిటో అతనికి స్పష్టంగా చెప్పేసేరు.

"నువ్వు బీదవాళ్లా ఉన్నావు. అవునా? అవును. అటువంటప్పుడు నువ్వు నా ఖరీదిచ్చుకోగలవా? ఇచ్చుకోలేవు. ఎంత ఖరీదంటావా? ఎంతైతే నీకెందుకు? నువ్విచ్చుకోలేనంత! సరిపోయిందా? మీ ఊరి డాక్టరు నువ్విప్పుడు ఏమీ ఇచ్చుకోలేవనీ, తరవాతెప్పుడో ఇస్తావనీ రాస్తున్నాడు. అంచేత తిన్నగా జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లు. అక్కడ డ్యూటీలో యెవరో ఒకరుంటారు..."

అని డాక్టరు గారు చెప్తూండగా ఆ నాటుమనిషి గబగబా ముందుకి వచ్చి డాక్టరు గారి కాళ్లమీద పడబోయేడు. డాక్టరు గారు వెనక్కి జరిగేరు.

"బాబ్బాబు! బాబ్బాబు!" అని ప్రాధేయపడ్డాడు ఆ ఆసామీ.

"ఇస్! లేలే! లే!" అని మూర్తిగారు కేకలు వెయ్యగా ఆ ఆసామీ లేచేడు.

అప్పుడు మూర్తిగారు చాలా శాంతంగా చెప్పేరు.

"ఓయ్ నాయుడూ! నే చెప్పేది శ్రద్ధగా విను. మీ అమ్మకి ఉన్న జబ్బేమిటో ఆ చీటీలో డాక్టరు గారు రాసేరు. అందుగురించి అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యాలి. అర్జంటుగా చెయ్యాలంటే నాకిప్పుడు వీలుపడదు. నేనిప్పుడు అర్జంటుగా మరొక ఆపరేషన్‌కి వెళ్లాలి. నువ్వు రాకముందే నేను ఆ ఆపరేషన్‌కి వప్పుకున్నాను. అంచేత వెళ్లు. వేగిరం వెళ్లు. హెడ్‌క్వార్టర్స్ ఆస్పత్రికి వెళ్లు. వెళ్లు వేగిరం వెళ్లు!"

అని అతణ్ని తొందరచేసి బలవంతంగా ఇంట్లోంచి పంపించేసేరు మూర్తి డాక్టరుగారు.

వీధితలుపు చేరవేసి, వెనక్కి తిరిగి భార్యవైపు చూసేరు మూర్తిగారు. ఆవిడ సోఫాలో కూర్చుని ఏదో ఆలోచిస్తోంది.

"ఏ పెనీ ఫర్ యువర్ థాట్స్!" అన్నారు మూర్తి డాక్టరు గారు.

ఆవిడ ఆలోచనలోంచి బైటపడి

"అతన్ని యెందుకలా పంపించేసేరు? తప్పుకదా!" అంది.

"ఉచితంగా చెయ్యడానికి నేనేం ప్రేమసమాజం వాణ్ణి కాను. వాళ్లయినా వాళ్లు చేసే పనికి మరెక్కణ్నించో డబ్బు గుంజుతారు" అని కొంచెం చిరాగ్గా అన్నారు మూర్తిగారు భార్య మాటకి జవాబుగా.

"అతనైనా యేదో ఇస్తానన్నాడుగా?" అంది భార్య.

"యెప్పుడో ఇస్తాట్ట. అదైనా నేనడిగింది ఇవ్వలేడు. ఇచ్చుకోలేడని వాళ్ల ఊరి డాక్టరు ఆ రికమెండేషన్ లెటర్లో రాయనే రాసేడు. ఆపాటి దానికి నేనెందుకు కష్టపడాలి? నాకు దేముడు ఓ రకం శక్తి ఇచ్చేడు. ఆ శక్తిని నేను నా ఇష్టం వచ్చినంత ఖరీదుకి నా ఇష్టం వచ్చిన వాళ్లకి అమ్ముతాను. ఇందులో అన్యాయం, అధర్మం అటువంటివేమీ లేవు. తెలిసిందండీ మేడమ్, లాయర్ శ్రీకంఠరావుగారి అమ్మాయివయ్యుండీ కూడా ఆపాటి లాజిక్ తెలుసుకోలేదా నువ్వు?"

అని నవ్వుతూ ముగించేడు మూర్తి డాక్టరు.

శ్రీలక్ష్మి యేమీ మాట్లాడలేదు. ఆమె నిట్టూర్చింది.

మూర్తి డాక్టరు లోనికెళ్లి దుస్తులుమార్చుకొని హాల్లోకి వచ్చాడు. శ్రీలక్ష్మి ఇంకా సోఫాలోనే కూర్చొని వుంది.

"చాలా లేట్ అయిపోయేను వెళ్తాను" అన్నాడు మూర్తి డాక్టరు.

"ఎక్కడికి" అన్నట్టుగా ముఖం పెట్టింది శ్రీలక్ష్మి.

"ఆపరేషన్‌కని చెప్పేను కదూ! ఆపరేషన్ కార్డ్స్! ఈపాటికి మా ఫ్రెండ్సంతా ఫుల్ స్వింగులో ఉంటారు" అని తొందరగా చెప్పేసి పేకాటకి పయనమయేడు మూర్తి డాక్టరు. అప్పటికి రాత్రి పదకొండున్నర దాటింది.

— x — x — x —

రాత్రి పదకొండున్నర దాటింది. పదినించీ కూడా వర్షం తెగ జోరుగా పడుతోంది. "ఏనుగు తొండాలా లేక రక్కసి కుండలా?" అనిపించేటంత హడావిడిగా పడుతోంది. వర్ష ధారలు పెట్టే చిరాకువల్ల కాబోలు గాలికి పిచ్చెక్కినట్టుగా ఉంది. వర్షపుధాటికి పిచ్చిగాలికి,

భయపడి కుంచించుకుపోయింది కాబోలు, చీకటి మరీ చీకటిగా ఉంది. కొండలమీద మంచు గడ్డలన్నీ గాలిగా మారిపోయేయి కాబోలు, చలి కొరుక్కు తినేస్తుంది. కొండలు కూడా గజగజలాడి వజవజ వణికేటంత చలిగా ఉంది. తోటల్లోనూ, పైరులమీదా, పాకలపైనా గాలీ వానా చేసే చప్పుడు యమదూతల అరుపుల్లా, రక్కసి నక్కల ఊళల్లా భయంకరంగా ఉంది. ఇనుపగోడల మధ్య కూర్చున్నప్పటికి ముక్కుకి నీటి వాసన గుప్పుమని తగిలేటంత ఫోర్సుతో ప్రవహించే ఆ గాలివాన, ఆ రాత్రిని రౌద్రంగా చెండాడిపోతోంది, చీల్చుకు మరీ పోతోంది.

ఊరికీ రోడ్డుకీ మధ్య సుమారు మైలు దూరం వుంది. ఈ మధ్యదూరంలో అన్నీ పొలాలే. రోడ్డెక్కక ఆ రోడ్డంట ఓ రెండు ఫర్లాంగులు దక్షిణంగా నడిచి రోడ్డుకి అవతల పక్కకి దిగితే దాసుగారి పదెకరాల పొలం ఉంది. ఆ పొలం ఓ వారకి వారి కళ్లం ఉంది.

ఆ రాత్రి ఆ వానలో ఆ ఊరికీ ఆ రోడ్డుకీ మధ్య పొలాల గట్లంట ఓ మానవాకారం వెళ్తోంది; రోడ్డు ముఖంగా వెళ్తోంది; (మధ్య కర్ర తీసివేసిన), తాటాకుల గొడుగుని నెత్తిన పెట్టుకొని రెండు చేతులతోనూ దాన్ని అదిమిపట్టుకొని ముందుకి వంగి గాలినీ, వాననీ ఎదిరిస్తూ జోగుతూ వెళ్తోంది, కారుమబ్బులు వెర్రిగా నవ్వినప్పుడు ఆ ఆకారం బితుకూ బితుకూ మని కనిపిస్తోంది; కారుమబ్బులు వెర్రిగా నవ్వనప్పుడు కారుచీకట్లలో కలిసిపోతోంది ఆ ఆకారం.

దాసుగారి కళ్లంలో పశువుల పాకలో కొన్ని పశువులున్నాయి. వాటికి ఫరవాలేక పోవచ్చు. కాని కళ్లంలో పందిరికింద కొన్ని పశువులుండిపోయేయి. దాసుగారి ఇంట్లో పనిచూసుకొని తన గుడిసెకు వెళ్లి గంజినీళ్లు తాగి, దాసుగారి కళ్లంలోకి వారి పాలెగాపు - నరసయ్య - పయనమవబోతుండగా వర్షం పట్టుకొంది. వర్షం ఆరంభం అవగానే నరసయ్య తన గుడిసెనించి దాసుగారి లోగిల్లోకి పరిగెట్టేడు.

"పందిరికింద పశువులుండిపోయేయి కదరా నరసయ్యా?" అన్నారు దాసుగారు.

"చిత్తం" అన్నాడు నరసయ్య.

"మరైతే ఏం చేద్దాం?" అని అడిగేరు దాసుగారు.

"వర్షం తగ్గుతుందేమో చూద్దాం" అన్నాడు పాలెకాపు.

తగ్గలేదు వర్షం.

మరైతే వెళ్లి ఆ పశువుల్ని పాకలో కట్టకపోతే అయి సస్తాయే, అని చెప్పి ఋగత దగ్గర బేట్రీ దీపం తీసుకొని తనది కమ్మల గొడుగు పట్టుకొని బయల్దేరేడు నరసయ్య.

బేట్రీ దీపాన్ని మొల్లో పెట్టుకున్నాడు. కాని దాన్ని తియ్యడానికి వీల్లేకపోతూంది నరసయ్యకి. దీపం ఓచేత్తో తియ్యాలంటే రెండోచేతిలో గొడుగు ఉండకుండా ఉంది. చాలా భయంకరంగా ఉంది గాలి.

తడిసి ముద్దయిపోయేడు చలికి గజగజ వణుకుతున్నాడు. చిన్నతనం నుంచీ అలవాటయిన దారే కాబట్టి ఎంత చీకటిగా ఉన్నా, ప్రదేశం అంతా ఎంత జలమయమై వున్నా - అతని అడుగు మాత్రం ఆనికమీద మామూలు దారిలోనే పడుతోంది.

చెవుల్ని పూర్తిగా కప్పిన తలపాగా ఆ వర్షపు తుంపరకి నాని బరువెక్కుతోంది. గుండెల్ని

కప్పిన చింకికబ్బా వర్షపు జల్లుకి పూర్తిగా తడిసి ముద్దయిపోయింది. ధారలు కారే నీటిబరువుకి పంచె బరువుగా కిందికి దిగలాగుతోంది. చలికి నరాలు తోడేస్తున్నాయి. వేళ్లు కొంకర్లు పోతున్నాయి. పై వరుస పళ్లని కిందివరసవి టకటకమని కొడుతున్నాయి.

ఆ సమయంలో నరసయ్య దేని గురించి ఆలోచిస్తున్నాడు? ఖూనీ కేసులో ఇరుక్కుని జెయిల్లో చచ్చిన తండ్రి గురించా! సమయానికి సరైన వైద్యుడి సహాయం చిక్కక చనిపోయిన తల్లి గురించా? అమ్ముడయిపోయి అపహరింపబడిపోయి పరహస్తాల్లోకి పోయిన తన బీడు భూముల గురించా? బుగతగారి పొలాల్లో కూలికాపు చేసే తన భార్యా పుత్రుల గురించా? ముక్క చెక్కలయిపోయిన తన మొత్తం బతుగ్గురించా? చీకాకు పరిచే చినుకులు గురించా? గజగజలాడించే గాలిగురించా?

తొందరగా కళ్లానికి చేరుకుని అక్కడ పందిరికింద సొమ్ముల్ని పాకలో కట్టేసి తొందరగా ఇంటికి వచ్చి మంచం కింద "కుంపటెట్టుకొని తొంగుడుంటేగాని" ప్రాణం నిలబడక పోవచ్చునని అతను మరికొంత తొందరగా వేసేడు.

మెరుపు మెరిసినప్పుడల్లా భూమాత అంతా శివాలెత్తినట్టు కనిపిస్తోంది. చేలూ చెట్లూ అన్నీ కూడా సుళ్లు తిరుగుతున్నాయి.

గట్లన్నీ దాటి, రోడ్డెక్కే సమయానికి నరసయ్యకి ఓ అనుమానం కలిగింది. ఈ గాలికి కళ్లంలో పశువుల పాక "ఉంటదా ఎగిరిపోద్దా?" అని అనుమానం కలిగేసరికి అతని గుండె గుభేలుమంది. "సొమ్ములన్నీ ఏటయిపోయుంటాయో ఏటో?" అని అతను మరికొంత తొందరగా నడక సాగించేడు.

అతని తొందరలో అతను ఉండడంచేత అంతా అయిపోయేదాకా ఏం జరిగిందో అతను సరిగా చూడనైనా చూడలేదు.

గాలిహోరులో దాని హోరు కలిసిపోయింది, ఒక్కసారిగా యెక్కణ్నించో వెలుగొచ్చింది. ఆ వెలుగులో ఆ వర్షపు ధారలు, చిక్కుపడిపోయిన బంగారపు నారలా మిలమిల మెరిసేయి. మెరుపైతే అది "ఇంతసేపు ఉంటదా" అని అతను ఆశ్చర్యపడే లోపునే పిడుగులా ఓ పదార్థం శరవేగంతో అతన్ని దాటుకొని వెళ్లిపోయి పెళపెళ విరిగింది.

నరసయ్య పరిగెట్టాడు. రోడ్డుమీద ఓ వంద గజాల దూరం పరిగెట్టాడు. చేతుల్లో ఉన్న గొడుగు విసిరేసి పరిగెట్టాడు. గొడుగు అతన్ని విడిచి రయిమని వెనక్కిపోయి వెల్లకిలా పడిపోయి వీపుమీదే దేకురుకుంటూ వెళ్లి రోడ్డు సైడుగా వున్న ఓ పాక పక్క చెట్టుమానుకి చీకట్లో చేర్లబడింది.

నరసయ్య గాలి కెదురీతగా పరిగెట్టి కుడిపక్క రోడ్డంచు నుంచి కిందికి దిగిపోయి ఊపు అపుకొని చూసేడు.

దెయ్యంలా ఏదో పడుంది. దాని కడుపులోంచి బైటికి రావడానికి ఓ మానవాకారం (కాబోలు) గిజగిజలాడుతోంది.

గట్టు దిగుతూండగా నరసయ్యకి గుర్తుకొచ్చింది. తన దగ్గర "బేట్రీ దీపం" ఉంది. అదితీసి చేతిలో సవరించుకొని మీట నొక్కేడు.

దీపం వెలుగులో ఆ కారు చాలా అసహాయంగా వెల్లకిలా పడిపోయిన గున్న ఏనుగులా కనిపిస్తోంది. అందులోనూ అదొక పక్కకి ఒరిగిపోయి వుంది. ఇవతలపక్క ఓ తలుపు తెరుచుకొని వేళ్లాడుతోంది. అందులోంచి గిజగిజమని ఓ ముసలిమనిషి పైకి వచ్చి పైకి రాడానికే శక్తంతా ఖర్చయిపోవడంచేత కాబోలు రాగానే టుపుక్కుమని కిందని చతికిల పడిపోయాడు.

"బేట్రీ దీపం వెలుగులో" నరసయ్యకి డెబ్భయ్యేళ్ల ముసలితనం, నలిగిన జరీ కండువా మెరుపుతనం, ముఖంలో పండు తమలపు తెలుపుతనం కనిపించేయి.

"చచ్చిపోలేదు కద!" అనుకొని ముందుకి వెళ్లేడు నరసయ్య.

అతను చచ్చిపోలేదు.

ఆమె కూడా చచ్చిపోలేదు. స్పృహ తప్పిపోయి కార్లోనే ఉంది. ఆవిణ్ని బైటికి నరసయ్యే లాగేడు. ఆవిడ లేత గులాబీ ముఖం నెత్తురుతో తడిసి ఉంది. కారే నెత్తురు ఆమె కట్టుకున్న ముదురు గులాబీ రంగు చీరమీదకి జారుతోంది. మంచు ముక్కల్లా పడే చినుకులకీ పులికన్నులా వెలిగే టార్చి వెలుక్కీ ఆవిడ కళ్లు విప్పింది.

నరసయ్య తన తలపాగా లాగి ఆమె ముఖం తుడిచేడు. నుదుటిమీద గాయం ఒక్కటి మాత్రం ఉంది. పాగా గుడ్డ చింపి గబగబా ఆమెకి కట్టుకట్టేడు నరసయ్య.

ముసలాయనకి ఏ దెబ్బా లేదు. గాభరాతోనూ, భయంతోనూ ఉన్నాడు. ఆ ఆడమనిషి అతని కూతురయినట్టుంది. ఆవిడ గురించి అతను "అయ్యో అయ్యో!" అని అస్పష్టంగా అరుస్తూ అదేదో దెబ్బతిన్న పశువులా ఏడుస్తూ కూర్చున్నాడు. వర్షపు చప్పుళ్ళో అతని గోల నరసయ్య చెవిని పళ్లేదు.

ఆవిడకి దగ్గర దగ్గర నలభయ్యేళ్లుంటాయని గాని, ఆవిడ అందంగా సౌమ్యంగా ఉందనిగాని ఆవిడ మెడలో బంగారానివీ, వజ్రాలవీ నగలున్నాయని గాని నరసయ్య గమనించలేదు. ఆవిడ అటూ ఇటూ చూస్తూ ఏదో అడుగుతోంది.

"ఆయనేరీ?"

ఆవిడ మాట ఏమిటో వినపడ్డంలేదు. అందుచేత ఆవిడ నోటికి తన చెవి ఆన్చి విన్నాడు నరసయ్య.

తన భర్త గురించి అడుగుతోంది ఆవిడ.

కారు ఒదిగిన పక్క అటుపక్క కారుకింద మరో మనిషి నలుగుతున్నాడని దీపం వెలుగులో పరికించి చూచి అప్పుడు తెలుసుకున్నాడు నరసయ్య. ఆ ఆసామిని ఆ కారు నెమ్మదిగా నెమ్మదిగా కిందికి నొక్కుతోంది. నరసయ్య చటుక్కున లేచి నిల్చున్నాడు. ఆ ఆడమనిషి పెనిమిటి అంత ప్రమాదమైన పరిస్థితిలో ఉన్నారని తెలిసేవరికి ముసలాయనా, ఆ ఆడమనిషీ కూడా లేచి నిల్చున్నారు. చలికీ, తడికీ, రొజ్జ గాలికీ, భయానికీ వాళ్లు వజవజ వణుకుతూ నిల్చున్నారు. నిల్చున్నవాళ్లు నిలువునా కుప్ప కూలిపోయి నరసయ్య కాళ్లమీద పడ్డారు. "నువ్వే దేఁవుడివి! అతన్ని రక్షించు! కాపాడు! మా పాలిట దేఁవుఁల్లా ఒచ్చేవు! రక్షించతన్ని రక్షించు!" అని వాళ్లు అంటున్నారు.

వాళ్ల మాటలు నరసయ్యకి వినిపించలేదు. టార్చి వెలుగులో చూస్తే వాళ్ల ముఖాలే వాళ్ల భావాలని తెలియజేస్తున్నాయి. ఆ వెలుగులో వాళ్ల ఆకారాలు అతనికి గుర్తుకు రానే వచ్చేయి. వాళ్ల మాటలతనికి వినిపించలేదు. వినిపించుకొనే స్థితిలో లేడతను. దేముడు బతుకిచ్చేడు. శక్తిచ్చేడు. సమాజంలో అతనికి గడిచిన కాలంలో ఆ బతుకు బండరాళ్ల పాలయింది. ఆ శక్తి సగం సన్నగిల్లింది. కాని, మిగిలిన శక్తినంతా ఎడమ భుజానికీ దండకీ తెచ్చుకొని, ఆ ఒదిగే కారుని నిలబెట్టి ఒక్క ఊపూపి ఆ కారుకింద నొక్కుకుపోయే మూర్తి డాక్టర్ని కుడిచేత్తో బైటకి లాగేడు నరసయ్య. ఆ పరిస్థితిలో వాళ్లమాట లతనికి వినిపించలేదు. కాని వాళ్ల భావం మాత్రం అతనికి తెలియకపోలేదు. రక్షించమని ప్రార్థిస్తున్నారు వాళ్లు - తనని!

ముసలి ప్లీడరు గారి ఏడుపు ప్రార్థనలకి గాని - "కూతురమ్మ కాబోలు" - ఆవిడ వేడుకొనే ఏడ్పుకి గాని ఏమైనా, ఏదైనా సమాధానం ఇద్దామని అప్పుడనిపించలేదు నరసయ్యకి. ఆ తరువాత డాక్టరు మూర్తి గార్ని అతను భుజాన్న వేసుకొని.....

ఆ అర్థరాత్రి ఆ గాలివానలో, ఆ సమయంలో, ఆ స్థలంలో అక్కడ వాళ్లు తప్ప ఇంకెవ్వరూ లేరు. మూర్తి డాక్టర్ని మోసుకెళ్లే శక్తి ఆయన భార్యకీ లేదు, ముసలి మామగారికీ లేదు. మరంచేత,

మూర్తి డాక్టర్ని మూపున వేసుకొని ఓ చేత్తో శ్రీలక్ష్మిని పట్టుకొని నడిపిస్తూ ఆవిడ తన ముసలి తండ్రి చెయ్యి పట్టుకు నడిపించుకొని తన వెంటరాగా అక్కడికి అల్లంత దూరంలో చెట్ల తోపులో రోడ్డుప్రక్కనే ఉన్న పాక దాకా నడిచి అక్కడ గడ్డి పరచి మూర్తి డాక్టర్ని పడుకోబెట్టి అతను "చావు బతుకుల మధ్య ఉండవచ్చేమో గాని ఇంకా బతికే ఉన్నాడు. బతకవచ్చు కూడాను" అని గ్రహించి అప్పుడనుకున్నాడు నరసయ్య.

"మిమ్మల్ని నేనెందుకు రక్షించాలి? మీ చావుబతుకుల మధ్య దూరి నలిగి మిమ్మల్ని బైటికి బతుకులోకి నేనెందుకు లాగి మీకు సాయపడాలి? మీకు నేను సాయపడను. మిమ్మల్ని ఛస్తే రక్షించను. ఈ సమయంలో నేను తప్ప మీకు మరో దేవుళ్లేడు, మనిషి లేడు. మిమ్మల్ని రక్షించే శక్తి ఇప్పుడు ఇక్కడ నాకుంది నాకుంది. మీ ఇళ్లు, మీ మేడలు, మీ ధన కనక వస్తు వాహనాలు, మీ సంసారాలు కడిగేసి ఊడ్చేసి మీ మాన ప్రాణాలతో సహా మీ సర్వం సమస్తం నాకు సమర్పిస్తారా, సమర్పిస్తేనే సాయం చేస్తాను. లేకపోతే చెయ్యను. నా శక్తికి నా యిష్టం వచ్చిన విలువ కట్టుకుంటాను. అదిస్తేనే మీకు నా సాయం! లేకపోతే లేదు! అవునంతే! నేనేం తప్పుచేసేను?! నేనేం తప్పు చెయ్యలేదు! మీరు నా విలువ నాకివ్వలేరా? ఇవ్వలేకపోతే ఊళ్ళోకి వెళ్లి ఇంకోణ్ని తెచ్చుకోండి!"

ఆ చీకట్లో అటువంటి ఆలోచనలేవో అస్పష్టంగా నరసయ్య మనసులో మెదిలేయి. అలా మెదలడమే అతనికి సిగ్గనిపించింది. "ఛా! తప్పు!" అనుకున్నాడతను.

మర్నాడు మధ్యాహ్నం ఊరి బుగత దాసుగారి లోగిలి ముందు మరో కారు ఆగింది. వర్షం బాగా వెలిసింది. ఎండ బాగా కాస్తోంది. మూర్తి డాక్టర్ని మరో డాక్టరు వచ్చి చూసి, ప్రమాదావస్థ దాటుతుందని నమ్మకంగా చెప్పి దగ్గిరుండి ఆయన్ని కార్లో వేయించేడు. తిరుపతి

(కార్లో) వెళ్లి వస్తుంటే ఆపద వచ్చినా ఆ వెంకటేశ్వరుడే నరసయ్య రూపంలో వచ్చి ఆదుకున్నాడని అంతా అనుకున్నారు.

శ్రీలక్ష్మి, శ్రీకంఠరావూ కారెక్కబోతూ చుట్టూ ఉన్న జనాన్ని పరికించి చూసేరు. శ్రీకంఠరావు నరసయ్యని గమనించి దగ్గరికొచ్చి (నిజంగానే) ఏడుస్తూ తన కృతజ్ఞత తెలియ జేసేరు. నిజంగా మేం నీ ఋణం తీర్చుకోలేం. కాని, నీకేం కావాలో చెప్పు. ఇవ్వగలిగిన దేదైనా సరే ఇస్తాను, చెప్పరా నాయనా అన్నాడు.

ఊరి బుగత దాసు గారు, ఊరి జనం అందరూ కూడా నరసయ్య వైపు కుతూహలంగా "ఏఁవఁడుగుతాడేఁ వఁడుగుతాడు" అన్నట్టుగా చూసేరు.

నరసయ్య ఏమీ అడగలేదు. నిట్టూర్చి అక్కణ్ణుంచి వెళ్లిపోయేడు.

మీరేఁవివ్వగలరుఁ! పోయిన తండ్రి నివ్వగలరా? చచ్చిన తల్లి నివ్వగలరా? మసిగా మారిన బంగారపు బతుకివ్వగలరాఁ! ఏమివ్వగలరు?

ఏమీ ఇవ్వలేరు.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 5-4-1968*